క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్, ఎస్ఎల్ఎన్ డెవలపర్స్, కల్యాణి కన్‌స్ట్రక్షన్స్, రంగారెడ్డి బండ, గంగా ఎన్‌క్లేవ్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు..

◆ సమ్మాన్ బెల్మార్ ఫీడర్ పరిధిలోని ఉడ్స్‌కాలనీ, సన్మాన్ ఆపార్ట్‌మెంట్స్, యాదిరెడ్డి బండ, వైష్ణవి మిడోవ్స్ విల్లాస్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ నిజాంపేట్, ఎస్ఎల్‌జీ, మావిల్లాస్ ఫీడర్ల పరిధిలోని శిఖర విల్లాస్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి శిఖర విల్లాస్ వరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక బస్‌పాస్‌ల జారీ కౌంటర్ ఏర్పాటు

నిజాంపేట్: దివ్యాంగుల సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి సాయినగర్ బస్టాప్‌లో ఉచిత బస్‌పాస్‌ల జారీ కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగే ఈ శిబిరంలో ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు హాజరై బస్‌పాస్‌లు పొందవచ్చని, తమ వెంట సదరన్ క్యాంప్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులను తీసుకువస్తే సరిపోతుందని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భగవద్గీత ప్రతి ఒక్కరూ చదవాలి



చింతల్: భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని భగత్‌సింగ్‌నగర్ హిందూ ధర్మ శాస్త్ర సేవా సమితి అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. గణపతి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్టార్ లైట్ అపార్ట్‌మెంట్‌లో గణేష్ మండపం వద్ద భగవత్ గీత పారాయణం నిర్వహించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మశాస్త్ర సేవా సమితి సభ్యులు, స్టార్‌లైట్ అసోసియేషన్ సభ్యులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

ఎయిర్ వాల్వ్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయండి



చింతల్: తాగునీటి పైప్‌లైన్ విస్తరణలో భాగంగా నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు అక్కడక్కడ ఏర్పాటు చేసిన ఇనుప చువ్వల కంచెలను గుర్తు తెలియనట్లు ధ్వంసం చేస్తున్నారు. జగద్గిరిగుట్ట నుంచి ఐడీపీఎల్‌కు వచ్చే 600 పైప్‌లైన్‌కు గాంధీనగర్ సీఐఈ గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్లాట్ నంబర్-1 ఎదురుగా ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్ కొన్ని ఏళ్ల క్రితం ఇనుప చువ్వల కంచెను ఏర్పాటు చేశారు. ఇటీవల ఎయిర్ వాల్వ్ రక్షణ కవచాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. జలమండలి అధికారులు చొరవ తీసుకుని ఎయిర్ వాల్వ్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మౌలిక వసతులను మెరుగు పరచాలి



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ భద్రసాయినగర్‌లో మౌలిక వసతులను మెరుగు పరచాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి శుక్రవారం కాలనీవాసులతో కలిసి కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో కమ్యూనిటీ హాల్‌తో పాటు పార్కుకు కేటాయించిన స్థలంలో అభివృద్ధి చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ యాకయ్య, వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, సభ్యులు సాయిలు, మునికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపం.. పనుల్లో జాప్యం



రోడ్డు పక్కనే గుట్టలుగా వేసిన మట్టి

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మందకొడిగా కొనసాగుతున్నాయి. వరదనీటితో పాటు మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్‌లోని టెట్రా టూలింగ్ సిస్టమ్స్ నుంచి ఎంపీపీ స్కూల్ వరకు రూ.90 లక్షల నిధులతో చేపట్టనున్న బాక్స్ డ్రెయిన్ పనులకు జులై నెలలో ఎమ్మెల్యే వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. అయితే పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ గిరినగర్ పోచమ్మ ఆలయం సమీపంలో బాక్స్ నాలా నిర్మాణానికి తవ్వకాలు చేపట్టి పనులు ప్రారంభించారు. అయితే పనులపై సంబంధిత శాఖ అధికారుల నిఘా కొరవడడంతో నిర్దేశిత వెడల్పు, లోతులో నాలా పనులు జరగడం లేదన్నారు. పనుల్లో సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోజుల తరబడి రోడ్డుపైనే మట్టి..

బాక్స్ నాలా పనుల్లో భాగంగా రోడ్డు తవ్వకాలు చేపట్టగా వెలువడిన మట్టిన సంబంధిత కాంట్రాక్టర్ పనులు జరుగుతున్న ప్రాంతంలోనే గుట్టలుగా పోశాడు. దీంతో మట్టి కుప్పలు రోడ్డును సగ భాగం ఆక్రమించాయి. ఇటీవల కురుస్తున్న వర్షానికి రోడ్డంతా బురదమయంగా మారుతోందని వెంటనే మట్టిని తరలించేలా చర్యలు తీసుకోవాలని గిరినగర్ వాసులు కోరుతున్నారు.



గిరినగర్ రోడ్డులో కొనసాగుతున్న బాక్స్ నాలా పనులు

వీఎన్ఆర్ వీజేఐఈటీలో అంతర్జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు నితిన్ , విజయ కుమారి

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో రెండు రోజుల పాటు అంతర్జాల వేదికగా జరిగే ×అడ్వాన్సెస్ ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఇండో–ఫ్రెంచ్ సెంటర్ ఫర్ ప్రొమోషన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సంచాలకులు నితిన్, జేఎన్‌టీయూహెచ్ ఎస్ఈ విభాగానికి చెందిన ఆచార్య విజయకుమారి ముఖ్యఅతిథులుగా హాజరై సదస్సును ప్రారంభిచారు. ఈ సదస్సులో భారతదేశం, యూఎస్ఏల నుంచి 200 లకు పైగా పరిశోధన పత్రాలు వాటిలో 36 పత్రాలను ఎంపిక చేసి ప్రచురణకు నివేదించామని నిర్వాహకులు కళాశాల ఎస్ఈ విభాగానికి చెందిన ఆచార్యులు డాక్టర్ కిరణ్మయి, బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన నితిన్, విజయకుమారి మాట్లాడుతూ... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం మన దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తోందన్నారు. వైద్యరంగంలోనూ తనదైన ముద్రను చాటుతోందన్నారు. సెఫిప్రా సంస్థ ద్వారా క్వాంటం కంప్యూటింగ్‌పై ఫ్రాన్స్, భారతదేశాలు పరిశోధనలు చేసే అవకాశముందన్నారు.

‘ఇళ్ల పంపిణీలో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది’



సమావేశంలో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అన్నీ తామై డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అధికార పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారని అన్నారు.

◆ జగద్గిరిగుట్ట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కౌసల్య, బీజేపీకి చెందిన సునీత అనే మహిళకు మొదటి విడతలోనే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇచ్చామని చెప్పుకోవడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఇతర పార్టీలకు చెందిన వారికి ఒక్కొక్కరికి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చి పేదలందరికీ ఇచ్చినట్లు వారి ప్రవర్తన ఉందన్నారు.

◆ నియోజకర్గం వ్యాప్తంగా లక్షలాది మంది దరఖాస్తు చేసుకుంటే వేలల్లో ఇస్తున్నారని, అందులో సైతం ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లను ఇవ్వడం దారుణమన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన పోరాడుతుందన్నారు.



విద్యార్థులకు కిట్ల పంపిణీ

దుండిగల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు తమ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందుంటుందని కూన కృష్ణగౌడ్ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దుండిగల్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శుక్రవారం కేకేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను విద్యార్థులకు అందజేశారు.తన సోదరుడు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు తాము ఈ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించామన్నారు. విద్యార్థి దశలో ఉండే సమస్యలు తమకు తెలుసని అందుకే విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రాముగౌడ్, నాయకులు విఘ్నేశ్వర్, పీసరి కృష్ణారెడ్డి, ఆకుల విజయ్‌సాయి, దొడ్ల కృష్ణ, వెంకటేశ్ నాయక్, రోజా, రాములు, పాండు పాల్గొన్నారు.

రోడ్డు దాటాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే!

కుత్బుల్లాపూర్: ఈ రోడ్డు దాటాలంటే వారు సర్కస్ ఫీట్లు చేయాల్సిందే... ట్రాఫిక్ పోలీసులు సమన్వయ లోపం కారణంగా ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కుత్బుల్లాపూర్, చింతల్ ప్రధాన రహదారి కృష్ణ హోటల్ సమీపంలో గతంలో పాదచారులు రోడ్డు దాటకుండా బారికేడ్లు పెట్టడం పలు విమర్శలకు తావిస్తుంది. రోడ్డు దాటే క్రమంలో కొంత మంది మహిళలు ఇనుప కడ్డీల కింది నుంచి వెళ్తున్నారు. పాదచారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా మొత్తం అటూ ఇటూ నడవకుండా చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాబోయే సాధారణ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని, కలిసికట్టుగా సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని బోగారం హోలీ మేరీ ఇంజినీరింగ్ కాలేజీలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు(ఈఆర్వోలు), రిటర్నింగ్ అధికారులు(ఆర్వోలు), 16మంది జిల్లా నోడల్ ఆఫీసర్లతో ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు ఎన్నికలకు ఎంత సిద్ధంగా ఉన్నారనే విషయాలపై ఆయన ఆరా తీశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను జిల్లావ్యాప్తంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర విషయాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. జిల్లాలో ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేలా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి త్వరలో జరిగే సమావేశానికి అధికారులందరూ పూర్తి వివరాలతో హాజరు కావాలని తెలిపారు.

బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో స్పాట్ అడ్మిషన్స్

శామీర్‌పేట్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఈ విద్యా సంవత్సరానికి టీఎస్‌డబ్ల్యూర్ డీసీడబ్ల్యూ జగద్గిరిగుట్టలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు ప్రవేశ పెడుతున్నట్లు ప్రిన్సిపాల్ ఇష్రత్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ధ్రువపత్రాలు, అకాడమిక్ రికార్డులు, జిరాక్స్ కాపీలతో శామీర్‌పేట్‌లోని టీఎస్‌డబ్ల్యూర్‌డీసీడబ్ల్యూ వద్ద నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్, అడ్మిషన్ ప్రక్రియకు హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్: 91210 04530.

రాష్ట్ర అటవీ అకాడమీలో సదస్సు

సుభాష్‌నగర్: అటవీ సంరక్షణ, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల మధ్య సమతూకాన్ని పాటించడం అనే అంశంపై శుక్రవారం దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అటవీ దళాల అధిపతి ఎమ్.డొబ్రియాల్ మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ చట్టంలో తలెత్తే సమస్యలను పరిష్కరాలు ఈ సదస్సు చూపనుందన్నారు. వివిధ రకాల భూముల విషయంలో చట్టం వర్తింపు, అటవీయేతర ప్రాంతాల్లో ప్లాంటేషన్, అటవీ ఉత్పాదనలను పెంచడం, అటవీ ప్రాంతాల్లో నివరించే ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అటవీ చట్టణం దోహద పడనుందన్నారు. అటవీ చట్టంపై ఉన్న అపోహలను ఈ కార్యశాల దూరం చేస్తుందని, అటవీ చట్టంపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సదస్సులో అటవీ ఉప డైరెక్టర్ జనరల్ సుబ్రహ్మణ్యం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ సూపరిండెంట్ శంభు, న్యాయ నిపుణులు డీవీఎస్ మూర్తి ప్రసంగించారు.



మీనాక్షిలో జరిగిన గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

సిద్ధి వినాయక నమో నమః

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద శుక్రవారం విశేష పూజలు జరిగాయి. పలు మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించి గణేశ్‌లను నిమజ్జనాలకు తరలించారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం, సాయంత్రం జరిగిన పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొంపల్లి పీసెంట్ వ్యాలీలో..



ఎన్సీఎల్ నార్త్ కాలనీ ఎమరాల్డ్ బ్లాక్‌లో మట్టి గణపతికి పూజలు



ప్రసూననగర్‌లో వినాయక మండపం వద్ద నాటక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



నందానగర్‌లో జరిగిన అన్నదానంలో బీఆర్ఎస్ నేత కేఎంప్రతాప్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్



గుడెన్‌మెట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



వెంకటేశ్వరనగర్‌లో పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ గౌరీశ్



కొంపల్లిలో జరిగిన పూజలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, రాజిరెడ్డి, శివాజీ



జీడిమెట్ల ఉడ్స్‌కాలనీలోని గణేశ్ మండపంలో జరిగిన కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అకారణంగా దాడికి దిగిన ఐదుగురిపై కేసు

జగద్గిరిగుట్ట: అకారణంగా ఓ విలేకరిని అకారణంగా దూషించి దాడికి పాల్పడిన ఐదుగురిపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల క్రితం గాజులరామారం బాలయ్యనగర్ బస్తీ కమాన్ సమీపంలో టీ తాగుతున్న జర్నలిస్ట్‌పై స్థానికంగా ఉండే కొందరు వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడారు. ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించినందుకు దాడి చేశారు. అంతటితో ఆగకుండా సదరు విలేకరిపై తప్పుడు కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారు. దీంతో జర్నలిస్ట్ సంఘం సభ్యులు ఈ విషయమై జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం దాడికి పాల్పడిన పెర్రిల్లి రాంభూపాల్ రెడ్డి, పోతిరెడ్డి, ప్రసాద్, రవీందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిలను గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం


కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం సూరారం డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.75 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో అభివృద్ధి పనులకు నిధుల ఢోకా లేకుండా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

◆ సూరారం లక్ష్మీనగర్‌లో ప్రగతియాత్ర చేపట్టిన ఎమ్మెల్యే ఇటీవల పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా మిగిలిన పనులను సైతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరటివ్ సొసైటీ చైర్మన్ మన్నే రాజు, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, జనరల్ సెక్రటరీ సిద్దిక్, సీనియర్ నాయకులు మన్నే బాలేష్, రాఘవ రెడ్డి, ఇంద్రసేన గుప్తా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

38 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

◆ పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ పథకం కింద మంజూరైన రూ.37,48,000 విలువ చేసే చెక్కులను 38 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివేకానంద్ అందజేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్